

డిగ్రీ రెండో సెమిస్టర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ అనుబంధ డిగ్రీ కళాశాలల విద్యార్థుల రెండో సెమిస్టర్ సప్లిమెంటరీ ఫలితాలను బుధవారం వర్సిటీ అధికారులు విడుదల చేశారు. 2024-25 విద్యా సంవత్సరానికిగాను ఈ పరీక్షలు ఈ ఏడాది ఏప్రిల్ చివరి వారంలో నిర్వహించారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ, బీవీహెచ్ జనరల్, ఆనర్స్ కోర్సులకు 5,957 మంది విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాయగా 37.58 శాతం మంది ఉత్తీర్ణులైనట్టు డీన్ డాక్టర్ జి.పద్మారావు తెలిపారు. ఈ ఫలితాలు జ్ఞానభూమి పోర్టల్‌లో అందుబాటులో ఉంచామన్నారు.

సాగు.. చేపట్టేదెలా?


డొంకూరులో చేపల చెరువు

- ఇచ్ఛాపురం మండలం డొంకూరు తీర ప్రాంతంలో దాదాపు 50 ఎకరాల్లో చేపల చెరువులు సాగుచేస్తున్నారు. ఇక్కడ నుంచి దేశీయంగా మార్కెట్లతో పాటు విశాఖ నుంచి విదేశాలకు చేపలు తరలిస్తుంటారు. కానీ ఇప్పుడు అమెరికాలో సుంకాల పెంపు కారణంగా.. స్థానికంగా చేపల ధర తగ్గడంతో చెరువులు నిర్వాహకులు దిగులు చెందుతున్నారు. ఇలా అయితే చేపల చెరువుల సాగు కష్టమని చెబుతున్నారు.

- ఆక్వా రంగంపై ట్రంప్ సుంకాల ప్రభావం
- వ్యాపారుల సిండికేట్‌తో పతనమైన ధర
- నష్టపోతున్న చేపల చెరువుల నిర్వాహకులు

ఇచ్ఛాపురం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి):

విదేశీ పన్నులకు సంబంధించి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల చేసిన ప్రకటనతో ఆక్వా రంగం ప్రమాదంలో పడింది. భారత్‌పై దిగుమతి సుంకాలు 25 శాతం పెంచుతూ ట్రంప్ నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ ప్రభావం రొయ్యలు, ఇతర ఆక్వా ఉత్పత్తులపై పడింది. సుంకాల భారంతో ధర పెరిగి.. ఇక్కడ నుంచి అమెరికాకు ఎగుమతులు తగ్గిపోతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో చేపల ధర అమాంతం తగ్గింది. రొయ్యల ధర పతనం దిశగా పయనిస్తుండడంతో చెరువుల నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో రణస్థలం, ఎచ్చెర్ల, గార, సంతబొమ్మాళి, సోంపేట, ఇచ్ఛాపురం, వజ్రపుకొత్తూరు, పోలాకి మండలాల్లో చేపల చెరువులు సాగు చేస్తున్నారు. 11 తీర మండలాల్లో సుమారు 4వేల హెక్టార్లలో ఆక్వా సాగవుతోంది. సుమారు 1,500 మంది చేపల చెరువులు నిర్వహిస్తుండగా.. వాటిలో దాదాపు పదివేల మంది పనిచేస్తున్నారు. ఇచ్ఛాపురం మండలం బూర్జపాడు పంచాయతీ డొంకూరు, శివకృష్ణాపురం, చిన్న లక్ష్మీపురం, పెద్దలక్ష్మీపురం గ్రామాల్లో దాదాపు 100 ఎకరాల్లో చేపల చెరువులు ఉన్నాయి. జిల్లాలో ఏడాదికి రూ.200 కోట్లకుపైగా ఆక్వా ఉత్పత్తుల విక్రయాలు సాగుతున్నాయి. ఇక్కడ లభ్యమయ్యే రొయ్య, ఇతరత్రా చేపలను వ్యాపారు లు సేకరిస్తారు. శ్రీకాకుళం నుంచి ఉభయ గోదావరి జిల్లాల వరకూ ఆక్వా ఉత్పత్తులు ఎక్కువగా విశాఖ పోర్టు నుంచి ఎగుమతి అవుతుంటాయి. ఇప్పటివరకూ అమెరికాలో విదేశీ ఆక్వా ఉత్పత్తులపై 3 నుంచి 4 శాతం సుంకం మాత్రమే విధించేవారు. కానీ ఇటీవల ట్రంప్ 25 శాతం సుంకం అని ప్రకటించడంతో ఆ ప్రభావం జిల్లాలో ఆక్వా ఉత్పత్తులపై పడుతోంది. వ్యాపారులు సిండికేట్‌గా మారి ధర తగ్గించి చేపలను, రొయ్యలను అడుగుతున్నారు. 20 కౌంట్ రొయ్యలు.. సుంకాల ప్రకటనకు ముందు రూ.640గా ఉండేది. ప్రస్తుతం రూ.580కు పడిపోయింది. గతంలో 30 కౌంటు రూ.470గా ఉండగా.. ఇప్పుడు రూ.420కు చేరింది. కిలోకు సుమారు రూ.50 పతనమైంది. దీంతో టన్నుకు రూ.3 లక్షల నుంచి రూ.4లక్షల వరకూ నష్టపోవాల్సి వస్తోందని చేపల చెరువుల నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడులు కూడా రావని, ఇలా అయితే చేపల సాగు కష్టమేనని వాపోతున్నారు.

● దెబ్బతీసిన జగన్ సర్కారు..

వైసీపీ హయాంలో ఆక్వారంగం గడ్డుపరిస్థితులను ఎదుర్కొంది. అప్పట్లో కనీస ప్రోత్సాహం లేదు. రూ.1.50కే యూనిట్ విద్యుత్‌ను అందిస్తామని చెప్పారు. కానీ అమలు చేయలేదు. ఈ-షిప్ విధానంలో అనేక నిబంధనలను తెరపైకి తెచ్చారు. వంద రొయ్యల ధర టీడీపీ హయాంలో రూ.260 వరకూ ఉండేది. కానీ వైసీపీ పాలనలో అమాంతం రూ.180కు పడిపోయింది. ఉప్పు, మంచినీరు ఆక్వా జోన్లుగా విభజించారు. పది ఎకరాల్లోపు సాగుచేసిన రైతులకు మాత్రమే రూ.1.50కు యూనిట్ విద్యుత్‌ను అందించారు. దీంతో జిల్లాలో వందలాది మంది ఆక్వా రైతులకు విద్యుత్ రాయితీ అందకుండా పోయింది. పది హార్స్ పవర్ విద్యుత్ మోటారును వినియోగించేవారికి రాయితీ వర్తించదని.. ఈ-షిప్ విధానంలో చెరువుల లీజు ఒప్పందం, లైసెన్స్, విద్యుత్ మీటరు, భూమి ఆన్‌లైన్ పత్రాలు ఇవ్వాలని (మిగతా 6వ పేజీలో..)


శ్రీకాకుళంలో పర్యటిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎమ్మెల్యే ఎన్ఈఆర్, పార్టీ శ్రేణులు

బీజేపీ బలోపేతమే లక్ష్యం

- సిక్కోలు.. ప్రపంచ నాగరికతకు ఆనవాళ్లు
- ప్రసాద్, స్వదేశీ దర్శన్ నిధులతో పురాతన ఆలయాల అభివృద్ధి
- పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

శ్రీకాకుళం/ పాత శ్రీకాకుళం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): 'భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యం. ప్రతీ గ్రామాన బీజేపీ జెండా ఎగరాల'ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టాక తొలిసారిగా బుధవారం శ్రీకాకుళంలో ఆయన పర్యటించగా.. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. డేఅండ్ నైట్ జంక్షన్ నుంచి సన్‌రైజ్ హోటల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు, మేధావి వర్గంతో వేర్వేరుగా మాధవ్ సమావేశమయ్యారు. బీజేపీ సిద్ధాంతాలను.. కూటమి ప్రభుత్వ లక్ష్యాలను, ప్రభుత్వ పథకాల అమలు, ప్రజల సమస్యలపై సమగ్రంగా చర్చించారు. శ్రీకాకుళంలోని గాంధీ మందిరంలో చాయ్‌పే చర్చ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. సన్‌రైజ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. 'ప్రపంచ నాగరికతకు ఆనవాళ్లు సిక్కోలులో ఉన్నాయి. ప్రపంచంలో ఏ ప్రాంతానికి వెళ్లినా సిక్కోలు వాసులు సామాన్య కార్మికుడి నుంచి వివిధ రంగాల నిపుణుల వరకు ఉన్నారు. సాగునీటిపరంగా అవకాశాలున్నా జిల్లా వ్యవసాయ రంగంలో వెనకబడి ఉంది. రైతులు ఇంకా రెండో పంట కోసం ఎదురుచూడటం బాధాకరం. జిల్లాలో జీవ వైవిధ్యానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. పురాతన ఆలయాలు, చారిత్రక ప్రాంతాలను ప్రసాద్, స్వదేశీ దర్శన్ పథకాల నిధులతో అభివృద్ధి చేస్తాం. భోగాపురం ఎయిర్‌పోర్టు పూర్తయితే జిల్లాలో పరిశ్రమల అభివృద్ధి జోరందుకుంటుంది. జిల్లా అభివృద్ధికి మూలపేట పోర్టు, మరో ఫిషింగ్ హార్బర్ ఏర్పాటుకు కేంద్రప్రభుత్వం నిధులు అందించి తోడ్పాటునిచ్చింది. విభజన అనంతరం రాష్ట్ర అభివృద్ధికి అవకాశం (మిగతా 6వ పేజీలో..)

ట్రస్టుభూమి ఆక్రమణపై కలెక్టర్ ఆరా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- నివేదిక ఇవ్వాలని తహసీల్దార్‌కు ఆదేశం

పొందూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పొందూరులోని 220-4 సర్వేనంబరులో విలువైన కేఎస్‌పీఎస్ఎన్ చౌటరీ భూమి ఆక్రమణపై జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆరా తీశారు. కలగర్ల సూర్యనారాయణ శెట్టి ట్రస్టు (కేఎస్‌పీఎస్ఎన్ చౌటరీ) పేరిట పొందూరులోని అంబేడ్కర్ కూడలిలో రోడ్డుకు అనుకుని 13 సెంట్ల స్థలం ఆక్రమణకు గురైంది. సుమారు రూ.2.5 కోట్ల విలువైన ఈ స్థలాన్ని విశాఖ వాసి.. తన భార్యపేరిట రిజిస్ట్రేషన్ చేయించాడు. ఈ వ్యవహారమై 'ట్రస్టు భూమి.. అన్యాక్రాంతం' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం ప్రచురితమైన కథనంపై కలెక్టర్ స్పందించారు. దీనిపై పూర్తి రెవెన్యూ పత్రాలతో నివేదిక సమర్పించాలని తహసీల్దార్ ఆర్.వెంకటేష్‌కు ఆదేశించారు. గతంలో ఈ భూమికి సంబంధించిన ఫసలీలో వివరాలతోపాటు ఆక్రమణదారులకు తప్పుడు 1-బీ పత్రాలు జారీచేసిన అధికారుల పేర్లను నివేదికలో సమర్పించనున్నట్లు తహసీల్దార్ వెంకటేష్ తెలిపారు.

ఐటీఐ మిగుల సీట్ల భర్తీకి దరఖాస్తులు

ఎచ్చెర్ల, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో రెండు విడతల కౌన్సెలింగ్‌లో భర్తీకాగా మిగిలిన సీట్లను నింపేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు అడ్మిషన్ల కన్వీనర్, ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకరరావు బుధవారం తెలిపారు. 'ఆసక్తి గల అభ్యర్థులు చేరాలనుకుంటున్న ఐటీఐలకు ఈ నెల 26వ తేదీలోగా ఐటీఐ డాట్ ఏపీ డాట్ జీవోవీ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. డౌన్‌లోడ్ చేసిన రిజిస్ట్రేషన్ ఫారం, ఒరిజనల్ సర్టిఫికెట్లను సమీపంలోని ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 27వ తేదీలోగా పరిశీలన చేయించుకోవాలి. ఈ నెల 29న ప్రభుత్వ ఐటీఐల్లో, 30న ప్రైవేటు ఐటీఐ సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహిస్తాం. అభ్యర్థులు సీటు కోసం దరఖాస్తు చేసుకున్న ఐటీఐలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలి. మరిన్ని వివరాల కోసం ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐని సంప్రదించాల'ని సుధాకరరావు తెలిపారు.


వరిని కాపాడుకుందాం

- భారీ వర్షాలతో నీట మునిగిన పైరు
- పరిశీలించిన వ్యవసాయ అధికారులు
- రైతులకు సూచనలు, సలహాలు

వ్యవసాయంలో సాంకేతికత అవసరం

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

6లో



టీచర్ల నియామకానికి సన్నద్ధం

- 25 నుంచి అర్హత అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

నరసన్నపేట, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామకానికి రంగం సన్నద్ధమవుతోంది. జిల్లాలో 543 టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వగా.. ఇటీవల డీఎస్సీ ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్లను ఈ నెల 25 నుంచి పరిశీలించనున్నారు. అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా విద్యాశాఖకు రాష్ట్ర కమిషనర్ ఆదేశాలు పంపారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. దరఖాస్తుల పరిశీలనకు 12 కమిటీలను సిద్ధం చేశారు. ఇందులో ఒక ఎంఈవో, కంప్యూటర్ ఆపరేటర్ చొప్పున మొత్తం 24 మంది బుధవారం రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన శిక్షణకు హాజరయ్యారు. వారందరికీ మరోసారి ఈ నెల 23న మాక్‌గా రాష్ట్ర కార్యాలయం నుంచి సరిఫికెట్ల పరిశీలనపై మార్గదర్శకాలు జారీ చేస్తారు. తర్వాత రాష్ట్ర కార్యాలయం నుంచి ఉపాధ్యాయ పోస్టుకు అర్హత సాధించిన అభ్యర్థుల ఫోన్ నెంబర్‌కు మేసెజ్ పంపిస్తారు. ఆయా అభ్యర్థులంతా ఒరిజినల్ సర్టిఫికెట్లతో జిల్లాకేంద్రంలో నిర్వహించనున్న ధ్రువపత్రాల పరిశీలనకు హాజరుకావాలి. కాగా గతంలో డీఎస్సీ ఫలితాలు విడుదల చేసిన తర్వాత సబ్జెక్టుల వారీగా మెరిట్ లిస్టు, ఏ కేటగిరి పోస్టుకు ఎన్ని మార్కుల వరకు ఆగిపోతుందని కటాఫ్ ఇచ్చేవారు. కానీ ఈసారి కేవలం పోస్టులు, కేటగిరిల ఆధారంగా రాష్ట్ర విద్యాశాఖ అధికారులు గుర్తించి అర్హత పొందిన అభ్యర్థులకు మాత్రమే నేరుగా మెసేజ్‌లు పంపనున్నారు. వారి సర్టిఫికెట్లను పరిశీలించి నియామకాలు చేపట్టనున్నారు. మారిన విధానంపై (మిగతా 6వ పేజీలో..)


ఉచిత బస్సు ప్రయాణంపై మహిళతో ఆరా తీస్తున్న డీపీటీవో అప్పలనారాయణ

'స్త్రీ శక్తి'పై మహిళల్లో ఆనందం

- ఆర్టీసీ బస్సుల్లో రోజూ 62వేల మంది వరకు ఉచిత ప్రయాణం
- జిల్లా ప్రజారవాణా అధికారి అప్పలనారాయణ

అరసవల్లి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి పథకంపై మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో.. జిల్లాలో రోజుకు సుమారు 62వేల మంది దీనిని వినియోగించుకుంటున్నార'ని జిల్లా ప్రజా రవాణా అధికారి సీహెచ్ అప్పలనారాయణ, ఒకటో డిపో మేనేజర్ అమరసింహుడు తెలిపారు. బుధవారం (మిగతా 8వ పేజీలో..)

తప్పుడు మస్టర్లతో వేతనాలు చెల్లింపులు

- సామాజిక తనిఖీ ప్రజావేదికలో వెల్లడి

7లో

ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

- ఏడీలు జగన్మోహనరావు, రామారావు

8లో

రైతులను దోచేస్తున్నారు!

- కిలో రూ.30కి కొనుగోలుచేసి రూ.60 పైగా విక్రయం
- శ్రీపురం కూరగాయల మార్కెట్‌లో వ్యాపారుల హవా
- గిట్టుబాటు ధరలేక నష్టపోతున్న అన్నదాతలు ● శీతల గిడ్డంగి నిర్మించాలని వినతి


శ్రీపురం వద్ద కూరగాయల మార్కెట్

శ్రీపురం కూరగాయల మార్కెట్‌లో వ్యాపారుల దందా సాగుతోంది. సిండికేట్‌గా మారి రైతుల నుంచి తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారు. తాము మాత్రం రెట్టింపు ధరకు అమ్ముకుంటున్నారు. ఆరుగాలం కష్టపడి పంటను మార్కెట్‌కు తెచ్చిన రైతులు తీవ్రంగా నష్టపోతుండగా.. వ్యాపారులు మాత్రం జేబులు నింపుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు.

కోటబొమ్మాళి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి):

కోటబొమ్మాళి మండలంలో చీపుర్లపాడు, చిన్నసాన, రేగులపాడు, కోటబొమ్మాళి, తర్లిపేట, జియ్యన్నపేట, సరియాబొడ్డపాడు, అక్కయ్యవలస, వాండ్రాడ, కురుడు, కన్నేవలస, విశ్వనాథపురం, నీలంపేట, మాసాహెబ్‌పేట, కొత్తపల్లి, సరియాపల్లి, సౌడాం, దుప్పిలపాడు, ఎత్తురాళ్ళపాడు, పొడుగుపాడు తదితర గ్రామాల్లో కూరగాయలను అధికంగా పండిస్తున్నారు. క్యాబేజీ, కాలీప్లవర్, క్యారెట్, బీర, బెండ, టమోట, కాకర, ఆనప, వంగ, దొండ, పొడువు చిక్కుడు, పొట్టి చిక్కుడు తదితర కూరగాయలను కోటబొమ్మాళి మండలం శ్రీపురం మార్కెట్‌కు తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. అయితే ఇక్కడ వ్యాపారుల హవా నడుస్తోంది. ప్రస్తుతం బయట మార్కెట్‌లో ఏ కూరగాయ చూసినా కిలో రూ.60 నుంచి రూ.100 వరకు పలుకుతున్నాయి. ఇక్కడ మాత్రం రైతులకు ఇందులో సగంధర కూడా గిట్టుబాటు కావడం లేదు. కొత్తపేట, కోటబొమ్మాళి, టెక్కలికి చెందిన కొందరు వ్యాపారులు గంపలు, బ్యాగులతో మొత్తంగా తక్కువ ధరకు రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. అనంతరం అదే సరుకును బరంపురం, ఇచ్ఛాపురం తదితర ప్రాంతాలకు లారీల్లో ఎగుమతి చేసి జేబులు నింపుకుంటున్నారు. కష్టపడి పండించిన తమకు కిలో రూ.30 నుంచి రూ.40 కూడా గిట్టుబాటు కావడం లేదని, వ్యాపారులు మాత్రం రూ.60 నుంచి రూ.100 పైగా అమ్ముకుంటున్నారని రైతులు వాపోతున్నారు. మార్కెట్‌లో కూరగాయలు నిల్వ ఉంచేందుకు శీతలీకరణ గిడ్డంగి లేకపోవడంతో వ్యాపారులు చెప్పిన రేటుకే అమ్ముతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారుల సిండికేట్‌పై అధికారులు కూడా చర్యలు తీసుకోవడం లేదని పేర్కొంటున్నారు. కేంద్రమాజీ మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు 2003లో శ్రీపురం కూరగాయల మార్కెట్‌లో శీతలగిడ్డంగి నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఆ తర్వాత ఎన్ని ప్రభుత్వాలు మారినా శీతలగిడ్డంగి మాత్రం నిర్మాణం కాలేదు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు (మిగతా 6వ పేజీలో..)

వరిని కాపాడుకుందాం

- భారీ వర్షాలతో నీట మునిగిన పైరు
- పరిశీలించిన వ్యవసాయ అధికారులు
- రైతులకు సూచనలు, సలహాలు

నరసన్నపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు సరుబుజ్జిలి, ఎల్ఎన్‌పేట, నరసన్నపేట, జలుమూరు తదితర మండలాల్లో వేలాది ఎకరాల్లో వరదనీరు చేరింది. రైతులు అమూల్య, సుభద్ర 333, ఎంటీయూ 1318, స్వర్ణ సంపద వంటి రకాలు తుంపర భూముల్లో ఎదలు వేశారు. ఈ రకాలు ఐదు రోజుల వరకు ముంపును తట్టుకుంటాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. నరసన్నపేట మండలం చిక్కాలవలస, మామిడివలస తుంపర భూముల్లో మునిగిన వరిపైరును ఏవో సూర్యకుమారి, వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించారు. వరిని కాపాడుకునేందుకు సూచనలు ఇచ్చారు.

- నీటి మునిగిన మడి నుంచి వీలైనంత తొందరగా నీటిని బయటకు పంపించాలి. తర్వాత యూరియా, పొటాష్ వేసుకోవాలి.
- తెగుళ్ల నివారణకు లీటరు నీటికి 1.0 గ్రా. కార్బండజిమ్ లేదా 2.0 గ్రా. కార్బండజిమ్, మాంకోజెబ్ కలిపి పిచికారీ చేసుకోవాలి.
- పిలకల దశలో సాధారణ రకాలు 5 రోజులు వరకు ముంపును తట్టుకుంటాయి. ఎంటీయూ 1064, పీఎల్‌పి 1100 వంటి రకాలు వారం వరకు మునక తట్టుకుంటాయి. ఆకులు పైకి కనిపిస్తూ 30-40 సెంటీ మీటర్ల నీరు నిలబడే తుంపర భూముల్లో మధ్యస్థ ముంపును కూడా తట్టుకుంటాయి.
- పిలకల దశలో నీటి మునిగిన వరిపొలం త్వరగా పుంజుకోవడానికి నీటిని తీసివేసి ఎకరానికి 20 కిలోల యూరియా, 10-15 కిలోల పొటాష్ వేసుకోవాలి.


మామిడివలస- చిక్కాలవలస వద్ద ముంపునకు గురైన వరిపైరును పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

మోతాదుకు మించి యూరియా వాడొద్దు..

వరి పంటలో ఎరువుల యాజమాన్యం పాటించాలని, మోతాదుకు మించి యూరియా వినియోగించవద్దని వరి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త కె.మధుకుమార్, ఆమదాలవలస వ్యవసాయ శాస్త్రవేత్తలు డా. ఎం.శ్రీనివాస్, బి.స్వాతి అన్నారు. బుధవారం నరసన్నపేట మండలం మాకివలస గ్రామంలో పీఎం రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకంలో భాగంగా వరిపంట సాగు యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించా రు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏవో వై.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలి..

రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా అడిషనల్ డీపీఎం ధనుంజయ్ సూచించారు. బుధవారం నరసన్నపేటలోని ఎంపీడీవో కార్యాలయంలో నరసన్నపేట, జలుమూరు, పోలాకి, సారవకోట ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో సమావేశం అయ్యారు. కూరగాయల, వాణిజ్య పంటలను ప్రకృతి విధానంలో సాగు చేసేందుకు ప్రోత్సహించాలన్నారు.

ఇంకా ముంపులోనే..

- వేలాది ఎకరాల్లో వరదనీరు
- సముద్రాన్ని తలపిస్తున్న పొలాలు


మామిడివలస వద్ద వరద నీటిలో వరిపైరు


బూర్జపాడులో నీటి మునిగిన వరినాట్లు

నరసన్నపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు, మూడు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు పొలాలు ఇప్పటికీ ముంపులోనే కనిపిస్తున్నాయి. కొన్నిచోట్ల సముద్రాలను తలపిస్తున్నాయి. వరి పొలాలను నీరు విడవక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జలుమూరు మండలం పాగోడు, కూర్మనాథపురం, వెలిసోద తదితర ప్రాంతాల నుంచి వరదనీరు రావడంతో నరసన్నపేట మండలంలో వేలాది ఎకరాలు వరదనీటిలో మునిగిపోయాయి. సుందరాపురం, మామిడివలస, రెల్లివలస, పారశెల్లి, కంబకాయి. బాలసీమ, బసివలస గ్రామాల్లో కాలువలు పొర్లి ప్రవహించి పొలాలను ముంచెత్తాయి. నాయకమ్మ బట్టి, నూకలమ్మ గెడ్డకు భారీగా ఎగువ నుంచి నీరు రావడంతో సుందరాపురం వద్ద పొలాలు సముద్రాన్ని తలపిస్తున్నాయి. సుందరాపురం, చిక్కాలవలస, మామిడివలస, కంబకాయి గ్రామాల్లోని తుంపర భూముల్లో వందలాది ఎకరాలు నీటిలో మునిగాయి. వరి పిలకలు కట్టే దశలో నీరు చేరడంతో అగ్గి తెగులు, కుళ్లు తెగులు ఆశించే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.గత ప్రభుత్వ హయాంలో కాలువల్లో పూడిక తీయకపోవడంతో నీరు పంటపొలాల్లోకి చేరుతోందని కంబకాయి గ్రామానికి చెందిన రైతులు వాపోతున్నారు.

బూర్జపాడులో నీటమునిగిన వరినాట్లు..

ఇచ్ఛాపురం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపిలేని వర్షాల వల్ల బూర్జుపాడు పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాల్లో వరినాట్లు నీట మునిగాయి. దీంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.


సుందరాపురం వద్ద సముద్రాన్ని తలపిస్తున్న పంట పొలాలు

సాగు.. 'చేప'ట్టేదెలా?

(ఐదో పేజీ తరువాయి)

మెలిక పెట్టారు. వీటిలో ఏ ఒక్కటీ లేకపోయినా యూనిట్ విద్యుత్‌కు రూ.6 వరకూ కట్టాల్సి వచ్చేది. కానీ కూటమి ప్రభుత్వం ఎటువంటి నిబంధనలు విధించకుండా చెరువులు సాగుచేసే వారికి రాయితీ విద్యుత్ అందించాలని నిర్ణయించింది. రూ.1.50కే యూనిట్ విద్యుత్‌ను అందించాలని సీఎం చంద్రబాబు ఆదేశాలిచ్చారు. దీంతో జిల్లాలో చేపల చెరువులు పెరిగాయి. కానీ ఇంతలోనే అమెరికాలో సుంకాల ప్రభావంతో ఆక్వారంగం మళ్లీ ప్రమాదంలో పడిందని చేపల చెరువుల నిర్వాహకులు పేర్కొంటున్నారు.

● ధర పతనం..



అమెరికా ప్రకటన మా బతుకులను దెబ్బతీసింది. రెండు ఎకరాల చెరువులో కష్టపడి పెంచి చేపలకు సరైన ధర లేకుండా పోయింది. ఆక్వా రంగం దారుణంగా దెబ్బ తింది. వైసీపీ పాలనలో గడ్డు పరిస్థితులను ఎదుర్కొన్నాం. కూటమి ప్రభుత్వం విద్యుత్ రాయితీ ప్రకటించింది. ఆహార ఉత్పత్తులకు ప్రోత్సాహం అందించాలని నిర్ణయించింది. దీంతో భవిష్యత్ బాగుంటుందని ఆశించాం. కానీ ఇప్పుడు వ్యాపారులు ఒక్కటై మమ్మల్ని దెబ్బతీస్తున్నారు.

-ఎస్.గోపాల్, చేపల చెరువు నిర్వాహకుడు, బూర్జపాడు

● భారీగా పెట్టుబడి..



రెండున్నర ఎకరాల చెరువులో చేపల పెంపకం చేపడుతున్నాను. సముద్రంలో చేపల వేట గిట్టుబాటు కాక... తీరప్రాంతంలో మత్స్యకారులే చేపల చెరువులను తవ్వుకున్నారు. భారీగా పెట్టుబడులు కూడా పెట్టారు. ఇప్పుడు అమెరికా ప్రకటనతో ధర పతనమైంది. మాకు ఏంచేయాలో పాలుపోవడం లేదు.

-దున్న కోటేశ్వరరావు, చేపల చెరువు నిర్వాహకుడు, డొంకూరు

రైతులను దోచేస్తున్నారు!

(ఐదో పేజీ తరువాయి)

కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు స్పందించి శీతలగిడ్డంగి నిర్మాణం చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

శ్రమఎక్కువ.. గిట్టుబాటు తక్కువ

ప్రస్తుత వాతావరణంలో కూరగాయలు పండించేందుకు అధికంగా శ్రమించాల్సి వస్తోంది. మందులకు అధిక ఖర్చవు తోంది. మార్కెట్‌లో మాత్రం గిట్టుబాటు ధర లభించడం లేదు. ఎంతోకొంతకు వ్యాపారులకు విక్రయిస్తున్నాం.

-వాయిలపల్లి శశిభూషణరావు, ఊడికలపాడు

ప్రభుత్వమే కొనుగోలు చేయాలి..

వ్యయప్రయాసతో పండించే కూరగాయలకు గిట్టుబాటు ధర లభించడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వమే నేరుగా కూరగాయలను కొనుగోలు చేసి పట్టణాల్లో ఉన్న రైతుబజార్లకు తరలించాలి. కూరగాయల రైతులను గుర్తించి సబ్సిడీపై విత్తనాలు, పురుగు మందులు అందజేయాలి. గిట్టుబాటు ధర లభించే వరకు నిల్వ ఉంచేలా శీతల గిడ్డంగులు ఏర్పాటు చేయాలి.

-పైడి అర్జునరావు, చీపుర్లపాడు

వ్యవసాయంలో సాంకేతికత అవసరం

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక విధానాలను అవలంబించడం ద్వారా ప్రయోజనాలు పొందవచ్చని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. శ్రీకాకుళం రూరల్ మండలం ఒప్పంగిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకునేందుకు వ్యవసాయ, అనుబంధ విభాగాల్లో సాంకేతికతను వినియోగించుకోవాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించడం, క్షేత్రస్థాయిలో సమస్యలకు పరిష్కారాలు చూపేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇండియన్ ఫార్మర్స్ ఫెర్టిలైజర్ కో ఆపరేటివ్ లిమి టెడ్ (ఇఫ్కో) తయారుచేసిన పరికరాలు, ఎరువులను పరిచయం చేశారు. బ్యాటరీ, పవర్, డ్రోన్ స్ప్రేయర్ల వినియోగాన్ని రైతులకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి త్రినాథస్వామి, ఏవో పి.నవీన్‌కుమార్, సర్పంచ్ చల్ల వాణిదేవి, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నగర పరిశుభ్రతపై దృష్టి సారించండి..

శ్రీకాకుళం అర్బన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): నగరంలో పరిశుభ్రతపై దృష్టి సారించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. 'స్వచ్ఛ సర్వేక్షణ్'లో భాగంగా పారిశుధ్య నిర్వహణపై వార్డు సచివాలయాల ప్లానింగ్, ఇంజినీరింగ్, శానిటేషన్ కార్యదర్శులు, కార్పొరేషన్ సిబ్బం దితో బుధవారం మునిసిపల్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం సందర్భంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా తాగునీటి పైపులైన్లు పాడైతే తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఇంటింటి నుంచి చెత్త సేకరణ, రోడ్ల క్లీనింగ్ చేపట్టాలన్నారు. నేను వార్డుల్లో పర్యటిస్తాను. అంతా పరిశు భ్రంగా కనిపించాలని స్పష్టం చేశారు. సమావేశంలో నగర కమిషనర్ పీవీవీడీ ప్రసాదరావు, మునిసిపల్ హెల్త్ అధికారి డాక్టర్ సుధీర్, తదితరులు పాల్గొన్నారు.


ఎరువులను పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్


ల్యాబ్‌ను పరిశీలిస్తున్న వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని

విద్యార్థులు ప్రయోగాత్మకంగా ఆలోచించాలి

- అంబేడ్కర్ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ రజని

ఎచ్చెర్ల, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రయోగాత్మకంగా ఆలోచించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని అన్నారు. వర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన ప్రయోగశాలలను బుధవారం ప్రారంభించారు. పవర్ ఎలక్ట్రానిక్స్, కంట్రోల్ సిస్టమ్, ఎలక్ట్రికల్ మెజర్‌మెంట్స్, నెట్ వర్కింగ్ వంటి అంశాల్లో అధ్యయనానికి ఈ ప్రయోగశాలలు ఉపయోగపడతాయన్నారు. వర్సిటీలో అత్యాధునిక పరిశోధనశాలలు, గ్రంథాలయాలను ఏర్పాటుచేశామని విద్యార్థులు, అధ్యాపకులు వినియోగిం చుకోవాలని కోరారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ పి.సుజాత, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.రాజశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

అరసవల్లి ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పనిచేస్తున్న 5లక్షల మంది ప్రైవేటు విద్యుత్తు కార్మికుల కోసం సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ప్రైవేటు విద్యుత్తు కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు కోరారు. నగరంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో బుధవారం రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు హైకోర్టు అడ్వకేట్ నంబూరి శ్రీమ న్నారాయణ, రాష్ట్ర కార్యదర్శి బొజ్జా రామకృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రైవేటు రంగంలో పని చేస్తున్న విద్యుత్తు కార్మికుల జీవితాలు దుర్భరంగా ఉన్నాయన్నారు. వైసీపీ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసిందని, దీంతో కార్మి కులకు అందాల్సిన సంక్షేమ పథ కాలు నిలిచిపోయా యన్నారు. ఈఎస్ఐ పథకానికి ప్రభుత్వమే యజమానిగా వ్యవహరించి, కార్మి కులకు ఇన్స్యూరెన్స్ పథకాన్ని వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపా ధ్యక్షుడు తోట తారకనాథ్, బాదంపూడి వాసు, సువ్వారి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతమే లక్ష్యం

(ఐదో పేజీ తరువాయి)

ఉన్న ప్రతి చోట బీజేపీ దృష్టి కేంద్రీకరించింది. జిల్లాలోని వైతాళికులను, సంఘసంస్కర్తలను, స్వతంత్ర సమరయోధులను గుర్తించి.. వారిని సత్కరించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. చెంచులు, బుడగజంగాలు, ఎరుకులను ఆదరించి మన సంస్కృతికి పునర్జీవనమివ్వాలి' అని తెలిపారు. సమావేశంలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు, పార్టీ సీనియర్ నాయకులు పూడి తిరుపతిరావు, పైడి వేణుగోపాలం, శవ్వాన ఉమామహేశ్వరి, అట్టాడ బాబ్జి, బి.ఉమామహేశ్వరరావు, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

టీచర్ల నియామకానికి సన్నద్ధం

(ఐదో పేజీ తరువాయి)

అధికారులు, అభ్యర్థుల్లో తీవ్ర చర్చ సాగుతోంది. ఈ విషయంపై డీఈవో రవిబాబు వద్ద ప్రస్తావించగా.. 'మెగా డీఎస్సీ -25 టీచర్ల నియామకానికి కసరత్తు చేస్తున్నాం. సర్టిఫికెట్ల పరిశీలన కమిటీల్లో ఉన్న 24 మందిని శిక్షణ కోసం రాష్ట్ర కార్యాలయానికి పంపించాం. ఉమ్మడిజిల్లాలో ఖాళీల జాబితాను పంపించాం. ఉన్నత అధికారుల ఆదేశాలు మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

వంశధారకు వరద నీరు

గార రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వంశధార నదికి వరద పోటెత్తడంతో నదిలో నీటి మట్టం పెరిగింది. గడచిన మూడు రోజులుగా ఎగువన కురిసిన వర్షాలకు హిరమండలం గొట్ట బ్యారేజీకి నీరు చేరింది. దీంతో ప్రాజెక్టు అధికారులు మంగళవారం 19 గేట్లను ఎత్తి సుమారుగా 15 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడిచిపెట్టారు. ఈ నీరు బుధవారం నాటికి శివారు ప్రాంతాలకు చేరడంతో నదిలో ప్రవాహం పెరిగింది.


గార సమీపంలో వంశధారలో ప్రవహిస్తున్న నీరు

గీత కులాల వారికి కొత్త బార్లు

శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొత్త బార్ పాలసీ-2025 ప్రకారం రిజర్వు ఉప కులాలకు బార్లు కేటాయిస్తున్నారు. ఈ మేరకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ, శ్రీకాకుళం మున్సిపల్ కార్పొ రేషన్ పరిధిలో శ్రీశయన కులానికి, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో సొండి కులానికి బార్ లైసెన్సులు కేటాయించినట్లు ఒక ప్రకటన విడుదల చేశారు. వార్షిక ఫీజు రూ.27.50 లక్షలు కాగా, దరఖాస్తుదారులు కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్, పాన్, రెండు పాస్‌పోర్టు ఫోటోలు జతచేయాలని, రూ.5లక్షల ఎర్నెస్ట్ మనీ డిపాజిట్, రూ.10 వేల ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తులను 29వ తేదీ వరకు స్వీకరిస్తామన్నారు. 30న కలెక్టర్ కార్యాలయంలో లాటరీ ద్వారా బార్లు కేటాయిస్తామని ఆ ప్రకటనలో తెలిపారు.

తవ్వేశారు.. వదిలేశారు!

- వర్షం వచ్చిందంటే వారికి నరకమే

అరసవల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఎస్బీఐ స్టాఫ్ కాలనీ అది. ఇక్కడ ఎక్కువగా ఉద్యోగులు, వ్యాపారులు నివసిస్తున్నారు. క్రమం తప్పకుండా మున్సిపాలిటీకి పన్నులు చెల్లిస్తున్నారు. కానీ అధికారులు కనీస వసతులైన రోడ్లు, కాలువలు అక్కడ నిర్మించలేదు. వర్షం వచ్చిందంటే ఆ కాలనీ వాసులకు నరకమే. జూలై 31న అధికారులు హడావుడిగా కాలనీకి వచ్చి అధికారులు రహదారికి ఇరువైపులా కాలువలు తవ్వేశారు. మట్టిని రోడ్డుపైనే వేసి వదిలేశారు. ఆ తర్వాత వారు అటువైపు చూసిన పాపాన పోలేదు. అసలే గతుకుల రోడ్డు, దానికి తోడు వర్షం, బురద. తవ్వి వదిలేసిన మట్టి. దీంతో ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే కాలనీ వాసులు భయపడి పోతున్నారు. ఇళ్లకు ఎదురుగానే బురదనీరు నిలుస్తోందని, గడచిన 30 ఏళ్లుగా దుర్భర జీవితం అనుభవిస్తున్నామని వారు వాపోతున్నారు. బొందిలీపురంలో కూడా ఇదే పరిస్థితి. అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.


గుంతల్లో నీరు, ఇరువైపులా మట్టితో ప్రమాదకరంగా మారిన ఎస్‌బీఐ స్టాఫ్ కాలనీ రోడ్డు


భయం భయంగా ప్రయాణిస్తున్న వాహనదారుడు

మహాత్ముని స్ఫూర్తి విశ్వజనీనం



అరసవల్లి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌కు స్వామివారి చిత్ర పటం అందిస్తున్న ఆలయ అధికారులు

శ్రీకాకుళం కల్చరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): తన ఆలోచ నలు, నడవడికతో ప్రపంచాన్ని ప్రభావితం చేసిన మహాత్మా గాంధీ స్ఫూర్తి విశ్వజనీనమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. నగరంలోని శాంతినగర్ కాలనీలో ఉన్న గాంధీ మందిరాన్ని బుధవారం సందర్శించారు. గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. స్వాతంత్ర్య సమరయోధులు, సంఘ సంస్కర్తల స్మృతివనం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వా తంత్ర్య సమరంలో త్యాగాలు చేసిన మహనీయులందరి విగ్రహాలను ఒకచోట ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. భావితరాలకు స్వాతంత్ర్య స్ఫూర్తిని అందించేలా తీర్చిదిద్దిన గాంధీ మందిరం నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయనకు నిర్వాహకులు సత్కరించి జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిపురపు తేజేశ్వరరావు, నాయకులు పూడి తిరుపతిరావు, పైడి వేణుగోపాలం, బిర్లంగి ఉమామహేశ్వరరావు, గొలివి కరుణాకర్, మందిరం ప్రతినిధులు నిక్కు అప్పన్న, బరాటం లక్ష్మణరావు, నటుకుల మోహన్, కె.వేణుగోపాల్, నక్క శంకరరావు, ఎంవీవీఎస్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యుని సేవలో..

అరసవల్లి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ప్రత్యక్షదైవం, ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామిని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు బుధవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలుకగా, అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అనివెట్టి మండపంలో వేద పండితులు ఆశీర్వచనం చేయగా ఆలయ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డి.వెంకటరమణ ప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నియోజకవర్గ సమస్యలను పరిష్కరించండి

● కేంద్ర మంత్రిని కోరిన ఎమ్మెల్యే అశోక్



కేంద్రమంత్రి రామ్మోహన్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే అశోక్

కవిటి/ఇచ్ఛాపురం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని ప్రధాన సమస్య లను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బెందాళం అశోక్ కోరారు. ఈ మేరకు బుధవారం ఢిల్లీలో కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును కలిసి వినతిపత్రం అందిం చారు. నియోజకవర్గానికి సాగునీటి వనరులను మెరుగుపర్చాలని, బాహుదా నదిపై వంతెన నిర్మా ణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఒడిశా సరిహద్దులోని చీకటి, జరడా రోడ్డు పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఉద్దానం మంచినీటి పథకంలో ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగు లను తొలగించారని, వారికి న్యాయం చేయాలని కోరారు. స్పందించిన కేంద్రమంత్రి సంబంధిత శాఖల అధికారులతో చర్చించి త్వరితగతిన పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

తప్పుడు మస్తర్లతో వేతనాలు చెల్లింపులు

● సామాజిక తనిఖీ ప్రజావేదికలో వెల్లడి

జి.సిగడాం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనుల్లో తప్పుడు మస్తర్లు వేసి వేతనాలు చెల్లించారని, మృతి చెందిన వ్యక్తికి కూడా మస్తర్లు వేశారని వెల్ల డైంది. బుధవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. జాబ్‌కార్డు మంజూరుకు డబ్బులు అడుగు తున్నారని బయట పడింది. ఈ సందర్భంగా డ్వామా పీడీ బి.సుధాకర్ మాట్లాడుతూ.. ఉపాధి పనుల్లో లోటుపాట్లు, అవకతవకలు గుర్తించేం దుకు ప్రతీ ఏటా సామాజిక తనిఖీ ప్రజా వేదికను నిర్వహించడం జరుగుతోందన్నారు. క్షేత్రసహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్ల పనితీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. నిద్దాం క్షేత్రసహాయకుడికి షోకాజ్ జారీ చేయాలని ఎంపీడీవోకి ఆదేశించారు. విచ్చలవిడిగా మస్తర్లు వేసి వేతనాలు చెల్లించేందుకు మీరేమైనా ప్రభుత్వ ధర్మకర్తలా అని మండిపడ్డారు. ఎంపీడీవో జి.రామకృష్ణ, ఏపీవో సత్యనారాయణ, జడ్పీటీసీ కాయల రమణ, టీడీపీ మండల అధ్య క్షుడు కుమరాపు రవికుమార్, పీఏసీఎస్ చైర్మన్ బెవర జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

డిప్లమో ఎలైడ్ హెల్త్ కేర్ కోర్సులకు దరఖాస్తులు

శ్రీకాకుళం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఏపీ స్టేట్ ఎలైడ్ అండ్ హెల్త్ కేర్ ప్రొఫెషన్స్ కౌన్సెల్ సెక్రటరీ ఆధ్వర్యంలో ఎలైడ్ హెల్త్ కేర్ కోర్సులకు దరఖాస్తుల స్వీకరిస్తున్నట్లు బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల్లో చేరేందుకు ఇంటర్ ఏ గ్రూపులో పాస్ అయిన విద్యార్థులకు సెప్టెంబర్ 8 వరకు అవకాశం ఉందన్నారు. ఈ కోర్సులు పూర్తి చేసిన వారికి ఉద్యోగావకాశాలున్నాయన్నారు. మా కళాశాలల్లో కన్వీనర్, మేనేజ్ మెంట్ కోటా సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు అవసరమైన ధ్రువపత్రాలతో కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. ఇతర వివరాలకు 76809 45357, 79950 13422 నంబర్లలో తెలుసుకోవచ్చన్నారు. లేకుంటే 'జెమ్స్' ఆసుపత్రి క్యాంపస్‌లో ఉన్న బొల్లినేని మెడ్ స్కిల్స్ ను సంప్రదించాలని పేర్కొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే దోమల నివారణ

ఇచ్ఛాపురం,ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతోనే దోమలను నివారించవచ్చని డాక్టర్ అఖిల్ మనోహర్ అన్నారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా బుధవారం అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వద్ద దోమల వల్ల కలిగే నష్టాలు, నివారణ చర్యలపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. అవగాహన ర్యాలీ నిర్వహించారు.

అపరిచితుల సమాచారం ఇవ్వండి

రణస్థలం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): తీర ప్రాంత గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తే తక్షణం పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ జి.హరికృష్ణ అన్నారు. బుధవారం రాత్రి కొవ్వాడ గ్రామంలో పల్లెనిద్ర చేపట్టి మత్స్యకారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తీరం వెంబడి మాదక ద్రవ్యాలు రవాణా అయితే 1093 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మత్స్యకారులు పాల్గొన్నారు.

పీఎస్ స్టడీ మెటీరియల్ పంపిణీ

సరుబుజ్జిలి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో ఫిజికల్ సైన్స్ స్టడీ మెటీరియల్‌ను బుధవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. పాఠశాల ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు పి.రవికుమార్, ఎస్.అరుణ, బి.శరత్‌కుమారి ఈ స్టడీ మెటీరియల్‌ను అందించారు. కార్యక్రమంలో బయోలాజికల్ సైన్స్‌ఫోరం రాష్ట్ర కౌన్సిలర్ గొంటి గిరిధర్, పలువురు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మురపాక మండలాన్ని సాధిద్దాం

లావేరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మురపాక మండలాన్ని సాధిద్దామని సాధన కమిటీ సభ్యులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక రామ మందిరం వద్ద కమిటీ సమావేశం నిర్వహించారు. ఈనెల 29న శ్రీకాకుళం జిల్లా కేంద్రానికి క్యాబినెట్ సబ్ కమిటీ వచ్చినపుడు ఈ ప్రాంత ప్రజలు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే ఎంపీ సహకారంతో మన వాణిని వినిపించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని తీర్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తేనెల సురేష్ కుమార్, మురపాక, అల్లినగరం సర్పంచ్ ప్రతినిధులు పెయ్యిల లక్ష్మణరావు, మాడుగుల మురళీధర్ బా బా, వివేకానంద యూత్ సొసైటీ అధ్యక్షుడు బాలి శ్రీనివాసనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు

ఆమదాలవలస, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయిస్తున్న దుకాణాలపై మునిసిపల్ కమిషనర్ తమ్మినేని రవి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యాపారులు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగించినా విక్రయించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం నిషేధించిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత వ్యాపారుల నుంచి అపరాధ రుసుం వసూలు చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ రెవెన్యూ బిల్ కలెక్టర్ డి.రవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసులు, కార్యకర్తల మధ్య తోపులాట



పోలీసులు, కార్యకర్తల మధ్య తోపులాట దృశ్యం

శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆధ్వర్యంలో పట్టణంలో బుధవారం నిర్వహించిన శోభాయాత్రలో ఆ పార్టీ కార్యకర్తలు, పోలీసుల మధ్య స్వల్ప తోపులాట జరిగింది. ఆ పార్టీ నేతలు ఏడు రోడ్ల కూడలి నుంచి జీటీ రోడ్డు మీదుగా అరసవల్లి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావుతో పాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు. అయితే జీటీ రోడ్డుకు ర్యాలీ చేరుకునేసరికి బందోబస్తు నిర్వహిస్తున్న టూటౌన్ పోలీసులు ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా కొంచెం వేగంగా నడవాలని కార్యకర్తలను కోరారు. ఈ నేపథ్యంలో కొందరు కార్యకర్తలు పోలీసులపై దురుసుగా ప్రవర్తించగా ఒక్కసారిగా తోపులాట జరిగింది. దీనిని గమనించిన ఎమ్మెల్యే ఈశ్వరరావు అక్కడకు చేరుకొని ఇటు పోలీసులు, అటు కార్యకర్తలను వారించి వివాదాన్ని సద్దుమణిగేలా చూశారు.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి రాజీవ్ ఆద్యుడు

ఆమదాలవలస, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఐటీ రంగంలో విప్లవాత్మక మార్పులకు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి పునాది వేసింది దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ అని వక్తలు అన్నారు. పట్టణంలోని వన్‌వే జంక్షన్ వద్ద ఉన్న కాంగ్రెస్ కార్యా లయంలో రాజీవ్‌గాంధీ జయంతిని బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పార్టీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు పూలమాల వేసి నివాళి అర్పించారు. కాంగ్రెస్ నాయకులు లఖినేని నారాయణరావు, సనపల రాజులు తదితరులు పాల్గొన్నారు.

యూరియా ఇప్పించండి

జి.సిగడాం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): యూరియా అందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తగుచర్యలు తీసుకోవాలని జనసేన నేతలు కోరారు. ఈ మేరకు బుధవారం విజయవాడలో మంత్రి అచ్చెన్నాయుడును జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు, కార్యదర్శి భూపతి అర్జున్ కుమార్, తాలాబత్తుల పైడిరాజు కలిసి వినతిపత్రం అందించారు.

నీటి సమస్య పరిష్కారం

సోంపేట రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గొల్లగండి పంచాయతీ పల్లి గొల్లగండి కాలనీలో తాగునీటి సమస్య ఎట్టకేలకు పరిష్కారమైంది. సమస్యను గొల్లగండి మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు గండు పల్లి చిన్న రాజారావు ఎమ్మెల్యే అశోక్, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దారి రాజు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో వారు స్పందించి జల్‌జీవన్ మిషన్‌లో ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తంచేశారు. దీంతో కాలనీ మహిళలు, వృద్ధులు ఆనందం వ్యక్తం చేస్తూ కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

బడి పిల్లల కథల పోటీలో సిద్ధార్థ్ ఎంపిక

కవిటి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో నిర్వహించిన బడిపిల్లల కథల పోటీలో ముత్యాలపేట జడ్పీ హైస్కూల్‌కు బి.సిద్ధార్థ్ రాసిన 'మొక్కవోని దీక్ష అనే కథ ఎంపికైంది. ఖమ్మంలోని పురిమళ్ల ఫౌండేషన్ నిర్వహించిన ఈ పోటీలో మొదటి పది మందిలో సిద్ధార్థ్ ఎంపికవడంతో హెచ్‌ఎం ఈశ్వరరావు, ఎంఈవో ధనుంజయ మజ్జి, ఉపాధ్యాయులు అభినందించారు.

నీట్ పీజీ పరీక్షలో ప్రతిభ

సోంపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నీట్ పీజీ ఎంట్రన్స్ పరీక్షలో పట్టణానికి చెందిన గెదెల ప్రజ్ఞామణి 1039 ర్యాంకు సాధించింది. ఈమె ఎంబీబీఎస్ ఆంధ్రా మెడికల్ కళాశాలలో పూర్తి చేసింది. కుటుంబ సభ్యులు అభినందించారు.

ఏఎంసీ చైర్‌పర్సన్ బాధ్యతల స్వీకరణ

కంచిలి, ఆగస్టు 20(ఆంధ్ర జ్యోతి): కంచిలి ఏఎంసీ చైర్ పర్సన్‌గా మద్దిల జయలక్ష్మి బుధవారం తొలి సంతకం చేసి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెను టీడీపీ నాయకులు నాగేశ్వరరావు, ఎస్.చంద్ర మోహన్, ధర్మయాదవ్, పీఏసీఎస్ అధికారులు అభినందించారు.

మహిళలపై నిందలు వేస్తే సహించేది లేదు



మాట్లాడుతున్న తమ్మినేని గీత, తెలుగు మహిళలు

ఆమదాలవలస, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ మహిళలను కించపరిచేలా వ్యవహరిస్తున్నారని, దీనిని విడనాడకుంటే సహించేది లేదని, ఆ పార్టీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీతా విద్యా సాగర్ హెచ్చరించారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. తిరుమల వెళ్లిన సందర్భంగా తెలుగు మహిళలు ఎమ్మెల్యే రవికుమార్‌తో కలిసి తీసుకున్న ఫొటోలను మార్ఫింగ్ చేసి వైసీపీ నేతలు బురదజల్లడంపై గీతాసాగర్‌తో పాటు పీఏసీ ఎస్ అధ్యక్షురాలు శిమ్మ మాధవి, మహిళా నాయకులు ఎన్ని శ్రీదేవి, బోయిన సునీత, గుడ్ల రాజ్యలక్ష్మి, పేడాడ మణి, పొందూరు విజయలక్ష్మి తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి తప్పుడు ప్రచారాలు మానుకోకుంటే తెలుగు మహిళల ఆగ్రహానికి బలికాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, రాష్ట్ర టీడీపీ న్యాయ విభాగ కార్యదర్శి టి.విద్యాసాగర్, కూన రమేష్, దవల అప్పలనాయుడు పాల్గొన్నారు.

మహిళలపై అనుచిత వ్యాఖ్యలు తగవు

పొందూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మహిళల పట్ల అనుచితంగా వ్యాఖ్యలు చేయడం వైసీపీ నేత చింతాడ రవికుమార్‌కు తగదని టీడీపీ నాయకులు అన్నారు. బుధవారం టీడీపీ మండల అధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్, మాజీ ఏఎంసీ చైర్మన్ అన్నెపు రాము, తెలుగుయువత జిల్లా ప్రధాన కార్యదర్శి బలగ శంకరబాస్కర్, శ్రీకాకుళం పార్లమెంటు పార్టీ ప్రధాన కార్యదర్శి సీపాన శ్రీరంగనాయకులు విలేకరులతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రవికుమార్‌తో పాటు మహిళల పట్ల చింతాడ చేసిన ఆరోపణలను ఖండించారు. సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు అనకాపల్లి చినరంగ, కె.అప్పలనాయుడు, మద్దిల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

28న జాబ్ మేళా

సోంపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): బారువ డిగ్రీ కళాశాలలో ఈనెల 28న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డి.రామారావు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు నిర్వ హించనున్న ఈ జాబ్‌మేళాలో ఇంటర్, డిప్లమో, డిగ్రీ పాస్ లేదా పెయిలైన అభ్యర్థులు పాల్గొనవచ్చన్నారు. వివరాలకు 96522 67682, 81793 42221 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

రాధాసాగరంలో గల్లంతైన వ్యక్తి మృతి

మెళియాపుట్టి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): లావణ్యకోట సమీపంలోని రాధాసాగరంలో సోమవారం బోటు షికార్ చేస్తూ గల్లంతైన లండ రామారావు(48) అనే వ్యక్తి మృతిచెందాడు. ఆయన మృతదేహం బుధవారం ఉదయం ఒడ్డుకు కొట్టుకువచ్చింది. రామారావుది గోకర్ణపురం పంచాయతీ చిన్నహంస గ్రామం. ఆయనకు భార్య భాగ్యలక్ష్మి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఒడిశా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చోరీకి యత్నించిన మహిళ అరెస్టు

మెళియాపుట్టి, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): పట్టుపురంలో ఓ ఇంట్లో చోరీకి యత్నించిన మనూజ మల్లిక్ అనే మహిళను అరెస్టు చేసినట్లు పాతపట్నం సీఐ రామారావు, మెళియాపుట్టి ఎస్ఐ పిన్నింటి రమేష్‌బాబు తెలిపారు. బుధవారం వారు ఈ వివరాలను వెల్లడించారు. ఈ నెల 14న పట్టుపురానికి చెందిన అంబలి లచ్చయ్య ఇంట్లో ఎవరూ లేని సమయంలో మనూజ ముసుగు ధరించి వచ్చి చోరీకి యత్నించింది. ఇంతలోనే లచ్చయ్య భార్య కాంచన రాగా ఆమెపై మనూజ దాడి చేసి స్కూటర్‌పై పరారైంది. దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ ఫుటేజీ ఆధారంగా మనూజను, ఆమె వాడిన స్కూటర్‌ను గుర్తించారు. ఆమెను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

కంచిలి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రంలోని కొణిసి నుంచి విజయనగరంలోని అలమండకి అక్రమంగా తరలిస్తున్న 15 గేదెలను బుధవారం కంచిలి ఫ్లై ఓవర్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ పారినాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. వాహనాలను తనిఖీ చేస్తుండగా ఒడిశా వైపు నుంచి వాహనంలో గేదెలను తరలిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నా మన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన యువకుడిపై కేసు

రణస్థలం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. జేఆర్‌పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికతో కనిమెట్ట గ్రామానికి చెందిన సతీష్ బుధవారం అసభ్యకరంగా పవర్తించాడు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వంటశాలపై కూలిన చెట్టు

పాతపట్నంరూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనంగి గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలకు చెందిన వంటశాలపై మంగళవారం చెట్టు కూలింది. దీంతో రేకుల షెడ్ ధ్వంసమైంది. బుధవారం విద్యార్థులకు మధ్యాహ్నభోజనం వండేందుకు నిర్వాహకులు ఇబ్బందులు పడ్డారు.

పేకాట శిబిరంపై దాడి

టెక్కలి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): టెక్కలి పట్టణంలోని పెద్దబ్రాహ్మణ వీధిలో మంగళవారం రాత్రి పేకాట శిబిరంపై దాడిచేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు బుధవారం వివరాలను వెల్లడించారు. శిబిరంలో ఉన్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ.50,200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎలక్ట్రికల్ బైక్ నుంచి మంటలు

టెక్కలి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): టెక్కలి కచేరి వీధిలోని మెయిన్‌రోడ్డులో ఓ దుకాణం వద్ద బుధవారం సాయంత్రం నిలిపిఉన్న ఎలక్ట్రిక్ బైక్ నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగి పొగలు వచ్చాయి. దీంతో అక్కడ ఉన్న వారు పరుగులు తీశారు. కొందరు స్పందించి బైక్ నుంచి బ్యాటరీని తీసి నీరు చల్లడంతో పొగలు, మంటలు అదుపులోకి వచ్చాయి. దీంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

'స్త్రీ శక్తి'పై మహిళల్లో ఆనందం

(ఐదో పేజీ తరువాయి)

శ్రీకాకుళంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో మహిళలతో వారు మాట్లాడారు. బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలుపై ఆరా తీయగా మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. ఉద్యోగరీత్యా బస్సుల్లో రోజూ ప్రయాణిస్తున్నామని, ఉచితం కావడంతో నెలకు రూ.10వేల వరకు మిగిలే అవకాశం ఉందని ఓ మహిళా ప్రయాణికురాలు చెప్పారు. మరికొందరు మహిళలు మాట్లాడుతూ.. బస్సుల్లో రద్దీ పెరిగిందని, ప్రత్యేక పర్వదినాల్లో అదనపు బస్సులు నడపాలని కోరారు. ఇదిలా ఉండగా 'విశాఖపట్నం, విజయనగరం, బత్తిలి, పాలకొండ, ఇచ్ఛాపురం మార్గాల్లో మహిళలు అధికంగా ప్రయాణిస్తున్నారు. గతంలో జిల్లాకు ఆక్యుపెన్సీ రేటు 72శాతం మాత్రమే ఉండేది. ఇప్పుడు 93 శాతానికి పెరిగింది' అని జిల్లా ప్రజారవాణా అధికారి అప్పలనారాయణ తెలిపారు. విద్యుత్ బస్సులు వస్తే ప్రయాణికులకు మరింత సౌకర్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ ప్రసాదరావు పాల్గొన్నారు.

పంటల బీమా చెల్లింపునకు గడువు పెంపు

నందిగాం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో సాగు చేస్తున్న వరికి సంబంధించి బీమా చెల్లించేందుకు గడువు పెంచినట్లు దిమిలాడ, తెంబూరు పీఏసీఎస్ సీఈవోలు పోలాకి శ్రీనుబాబు, ఎన్.దాసులు తెలిపారు. ఈనెల 25లోగా ఎకరాకు రూ.170 చొప్పున చెల్లించాలని సూచించారు. 1బీ, ఆధార్, బ్యాంక్ ఖాతా జిరాక్స్‌లతో నర్సిపురం, లట్టిగాంలోని కార్యాలయాలను సంప్రదించాలన్నారు. పీఏసీఎస్‌ల్లో రుణాలు పొందిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

అవినీతిపై దర్యాప్తు జరపాలి

టెక్కలి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖలో జరుగుతున్న అవినీతిపై దర్యాప్తు జరపాలని వైసీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేడాడ తిలక్ అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయ పనిముట్ల కొనుగోలు అంశంలో జరిగిన అవినీతిని బట్టబయలు చేసిన ఏపీ ఆగ్రోస్ మేనేజర్ రామ్మోహన్‌నాయుడుపై ప్రభుత్వం కక్ష కట్టి నెల్లూరు బదిలీ చేసిందని ఆరోపించారు. రైతులకు ఉచిత పంటల బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా సబ్‌ట్రెజరీ కార్యాలయం

కోటబొమ్మాళి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కోటబొమ్మాళి సబ్ ట్రెజరీ కార్యాలయం మందుబాబులకు అడ్డాగా మారింది. ఈ కార్యాలయం ఓ మారుమూలకు ఉండటం, ఎదురుగా వైన్ షాపు ఉండటంతో మందుబాబులు రాత్రి వేళల్లో ఇక్కడే మద్యం సేవిస్తూ బార్‌లా వాడుకుంటున్నారు. ఇటు వైపు పోలీసులు కూడా కన్నెత్తి చూడకపోవడంతో మందుబాబులకు అడ్డు అదుపులేకుండా పోయిందని సబ్‌ట్రెజరీ సిబ్బంది వాపోతున్నారు. వాళ్లు తాగి వదిలేసిన మందుసీసాలను ప్రతి రోజూ తాము శుభ్రం చేయాల్సి వస్తుందని వాపోతున్నారు. కొందరు అసాంఘిక కార్యక్రమాలు కూడా ఇక్కడ నిర్వహిస్తున్నారని అంటున్నారు. ఇప్పటికైనా పోలీసులు చర్యలు తీసుకోవాలని సబ్‌ట్రెజరీ కార్యాలయ సిబ్బంది కోరుతున్నారు.


సబ్‌ట్రెజరీ కార్యాలయం ముందు తాగి వదిలేసిన మందు సీసాలు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే గౌతు శిరీష ●ఆర్‌వోబీ నిర్వాసితులకు ఇళ్ల పట్టాలు పంపిణీ


ఆర్‌వోబీ నిర్వాసితులకు పట్టాలను అందజేస్తున్న ఎమ్మెల్యే శిరీష

పలాసరూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రజాసంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం కాశీబుగ్గ రైల్వేఫ్లైఓవర్ నిర్వాసితులకు(ఆర్‌వోబీ) ఇంటి స్థలాల పట్టాలను ఆమె పంపిణీ చేసి మాట్లాడారు. గతంలో టీడీపీ హయాంలో రైల్వే ఫ్లైఓవర్ కోసం ఇళ్లను తొలగించినప్పుడు నాటి ఎమ్మెల్యే గౌతు శివాజీ నగదుతో పాటు ఇళ్ల స్థలాలను అందిస్తానని మాటిచ్చారని, దాని ప్రకారమే రాజకీయాలకతీతంగా ప్రతీ నిర్వాసితుడికి ఇంటి స్థలాలను అందజేశామని అన్నారు. గత ప్రభుత్వం కేవలం మాటలు మాత్రమే చెప్పిందని అన్నారు. ప్రజలందరి సహకారంతో పలాస-కాశీబుగ్గ పట్టణ అభివృద్ధికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఆర్‌వోబీకి సంబంధించి 90మంది నిర్వాసితులకు లాటరీ పద్ధతిలో ఇళ్ల నెంబర్లను కేటాయించి పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో గ్రంధి వెంకటేష్, తహసీల్దార్ ఎన్.కళ్యాణచక్రవర్తి, ఏపీటీడీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, టీడీపీ నాయకులు లొడగల కామేశ్వరరావు, పీరుకట్ల విఠల్, ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, దువ్వాడ శ్రీకాంత్, రవిశంకరగుప్తా తదితరులు పాల్గొన్నారు.

రైతాంగాన్ని అన్నివిధాలుగా ఆదుకుంటాం

వజ్రపుకొత్తూరు, ఆగసు 20 (ఆంధ్రజ్యోతి): రైతాంగాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే శిరీష అన్నారు. బుధవారం పెద్దబొడ్డపాడు వద్ద వంశధార నీటికి హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు రైతులకు వంశధార నీరు అందించలేకపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే వంశధార నీరు శివారు భూములకు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు, ఉపాధ్యక్షుడు ఎ.ఉమామహేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ కణితి సురేష్‌చౌదరి, స్థానిక నాయకుడు వల్లభ కృష్ణారావు పాల్గొన్నారు. ● వంశధార నీరు అందించడంతో పలాస, వజ్రపుకొత్తూరు మండలాల రైతులు ఆనందంగా వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా శివారు భూములకు నీరు విడుదల కావడంపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోవిందరావు

మార్పునకు నాంది పలకాలి

● ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ● ఏఎంసీ పాలకవర్గ ప్రమాణం

పాతపట్నం ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) పాలన ద్వారా మార్పునకు నాంది పలకాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక ఏఎంసీ ప్రాంగణంలో బుధవారం సాయంత్రం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ కేంద్రం పాతపట్నం మండలానికి కాదని తొలిసారిగా మెళియాపుట్టి మండలానికి ఏఎంసీ అధ్యక్ష పదవినిచ్చి మార్పుకు శ్రీకారం చుట్టామన్నారు. పాలనారంగంలో ప్రజాదరణ సాధించి ప్రభుత్వానికి మంచిపేరును తీసుకురావాలని తెలిపారు. ఏఎంసీ చైర్‌పర్సన్‌గా చిన్నింటి గౌరమ్మ, వైస్‌చైర్మన్‌గా మడ్డు రామారావు, సభ్యులుగా సీమ మీనాక్షీదేవి, బంటుపల్లి జయలక్ష్మి, జామాన రాము, పొట్నూరు లక్ష్మీ, సవర రమేష్, గండుబారికి గణపతి, నందిగాం కృష్ణవేణి, సయ్యద్ జూర్, గోకవలస చంద్రశేఖరరావు, రాజాన రమణి. పడాల శ్రీను, బోను సరస్వతి, చింతల ప్రశాంత్ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ఎరువుల కొరత లేకుండా చూడండి

నియోజకవర్గంలో ఎరువుల కొరత లేకుండా చూడాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అధికారులను ఆదేశించారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో ఏడీ జగన్మోహనరావు, ఐదుమండలాల ఏవోలతో అత్యవసర సమావేశం నిర్వహించారు. వ్యవసాయశాఖ రాష్ట్ర డైరెక్టర్ ఎస్.ఢిల్లీశ్వరరావు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో ఫోన్‌లో మాట్లాడి ఎరువుల కొరత సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు.

ఐటీడీపీ నియోజకవర్గ కన్వీనర్‌గా రామారావు

పాతపట్నం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఐటీడీపీ నియోజకవర్గ కన్వీనర్‌గా తామరకు చెందిన కూర్మాపు రామారావు నియమితులయ్యారు. ఆయన్ను ఎమ్మెల్యే గోవిందరావు బుధవారం అభినందించారు. అధిష్ఠానం, ఎమ్మెల్యే ఎంతో నమ్మకంతో తనకు అప్పగించిన ఈ బాధ్యతకు న్యాయం చేసేందుకు అహర్నిశలూ పనిచేస్తానని రామారావు అన్నారు.

ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

● ఏడీలు జగన్మోహనరావు, రామారావు

పాతపట్నం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని వ్యవసాయశాఖ టెక్కలి సహాయ సంచాలకుడు కె జగన్మోహనరావు అన్నారు. మేజర్ పంచాయతీ పాతప ట్నంలోని పలు ఎరువుల దుకాణాల్లో బుధవారం ఆయన తనిఖీలు నిర్వహించారు. ఆ షాపుల్లో 200వరకూ యూరియా బస్తాలు ఉన్నట్లు గుర్తించారు. ఆయన వెంట ఏవో కిరణ్‌వాణి, ఏఈవో టి.భారతి తదితరులు ఉన్నారు. ● సీది, తామర గ్రామాల్లో బుధవారం వ్యవసాయ అధికారులు బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసంద ర్భంగా ఏడీ జగన్మోహనరావు మాట్లాడుతూ.. ప్రస్తుతం వరిలో యూరియా, పొటాషియం లోపం ఎక్కువగా ఉందన్నారు. పొటాష్ ఎకరాకు 15కేజీలు, యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియాను ఎకరాకు అర లీటరు చొప్పున పది రోజుల వ్యవధిలో పిచికారీ చేసుకోవాలన్నారు. దీనివల్ల అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు బండి రవివర్మ, తదితరులు పాల్గొన్నారు.

మందసలో..

మందస,ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తే చర్యలు తప్పవని పలాస సబ్‌డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడు ఎం.రామారావు, మందస మండల వ్యవసాయాధికారి జి.నాగరాజు అన్నారు. మందసలో పలు ఎరువుల దుకాణాలను బుధవారం వారు తనిఖీ చేశారు. లైసెన్స్ రికార్డులు, ధరల పట్టికలను పరిశీలించారు. దుకాణదారులు నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. రైతుల నుంచి ఫిర్యాదులు అందిన మేరకు తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు.

మోతాదుకు మించి యూరియా వాడొద్దు

నరసన్నపేట, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): వరిలో రైతులు ఎరువుల యాజమాన్యం పాటించాలని, మోతాదుకు మించి యూరియా వినియోగించవద్దని వరి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త కె.మధుకుమార్, ఆమదాలవలస వ్యవసాయ శాస్త్రవేత్తలు ఎం.శ్రీనివాస్, బి. స్వాతి అన్నారు. బుధవారం మాకివలస గ్రామంలో పీఎం రాష్ట్రీయ కృషి వికాస్ యోజనలో భాగంగా వరి సాగు యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏవో వై. సురేష్, ఏవో సూర్యకుమారి, శిమ్మ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సస్య రక్షణతోనే అధిక దిగుబడులు

హరిపురం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వరి సాగులో సస్యరక్షణ చర్యలు చేపడితేనే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ పలాస ఏడీ ఎం.రామారావు అన్నారు. మందస మండలం కొత్తపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా వరి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. రసాయన ఎరువులు వాడకం తగ్గించి, భూసారాన్ని పెంచే పచ్చిరొట్ట, సేంద్రియ ఎరువులు వినియోగించాలని సూచించారు. సాగుభారం తగ్గించేందుకు ప్రతి రైతు యాంత్రీకరణ వైపు మొగ్గు చూపాలని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏవో నాగరాజు, ఏఈవో ఉదయ్, జ్యోత్స్న, రైతులు పాల్గొన్నారు.


పాతపట్నం: ఎరువుల షాపు తనిఖీ చేస్తున్న ఏడీ జగన్మోహనరావు

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలి

ప్రకృతి వ్యవసాయ సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా అడిషనల్ డీపీఎం ధనుంజయ్ సిబ్బందికి సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నరసన్నపేట, జలుమూరు, పోలాకి, సారవకోట ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. కూరగాయలు, వాణిజ్య పంటలను ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేసేందుకు గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో దోమల నివారణ


నరసన్నపేట: ఉర్లాం పీహెచ్‌సీ ముందు నినాదాలు చేస్తున్న సిబ్బంది

నరసన్నపేట, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతో దోమలను నివారించవచ్చునని ఉర్లాం పీహెచ్‌సీ వైద్యురాలు షాలిని అన్నారు. బుధవారం ప్రపంచ దోమలు నివారణ దినం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు. కాగా, ర్యాలీ తూతూ మంత్రంగా చేపట్టడంపై విమర్శలు వస్తున్నాయి. గ్రామాల్లో తిరగాల్సిన సిబ్బంది కేవలం పీహెచ్‌సీ ఆవరణలో ర్యాలీ చేపట్టడంపై విమర్శలు వస్తున్నాయి.

వరద నీరు నిల్వ లేకుండా చూడాలి

పలాసరూరల్,ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ప్రపంచ దోమల నివారణ దినం సందర్భంగా బుధవారం రెంటికోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సునీల్ కుమార్ ఆధ్వర్యంలో రెంటికోటలో అవగాహన సదస్సు, ర్యాలీ చేపట్టారు. వర్షాకాలంలో వరద నీరు నిల్వ లేకుండా చూడాలని, దోమ తెరలను వాడుకోవాలని, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని గ్రామస్థులకు సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఆదమ్మ, ఫార్మసీ అధికారి బోనెల గోపాల్, సూపర్‌వైజరు కోటేశ్వరరావు, స్టాఫ్‌నర్స్ రాజేశ్వరి పాల్గొన్నారు.

పోలాకిలో..

పోలాకి ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పోలాకి, గుప్పెడుపేట ఆరోగ్య కేంద్రాల సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ దోమల నివారణ దినం నిర్వహించారు. వైద్యాధికారి శ్రీనాథ్, విస్తరణాధికారి నల్లిరవికుమార్, నర్సింగ్ ట్రైనీలు, ఏఎన్ఎంలు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

హిరమండలాన్ని శ్రీకాకుళం జిల్లాలోనే ఉంచాలి

హిరమండలం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): హిరమండలం మండలాన్ని శ్రీకాకుళం జిల్లాలోనే ఉంచాలని కూటమి నాయకులు తీర్మానం చేశారు. సుభలయ ఆర్ఆర్ కాలనీ కమ్యూనిటీ హాలులో బుధవారం మండల కూటమి నాయకులు సమావేశమయ్యారు. ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేస్తామంటున్న పలాస జిల్లాలో హిరమండలాన్ని చేరిస్తే ఈ ప్రాంతవాసులు అనేక ఇబ్బందులకు గురవుతారని జడ్పీటీసీ పి.బుచ్చిబాబు అన్నారు. భౌగోళికంగా పలాస ఎంతో దూరమని పేర్కొన్నారు. ప్రజల అభిమతం మేరకు స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, కేంద్రమంత్రి రామ్మోహన్‌యుడు ప్రభుత్వాన్ని ఒప్పించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు దారపు ఢిల్లేశ్వరరావు, ప్రత్యేక ఆహ్వానితులు తూలుగు తిరుపతిరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గోళ్ల సింహాచలం, ఎల్.కృష్ణ, ఎస్.గోవింద, యాళ్ల నాగేశ్వరరావు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

దుకాణాల ముందు చెత్త వేస్తే చర్యలు

కోటబొమ్మాళి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): దుకాణాల ముందు రోడ్డుపై చెత్త వేస్తే సంబంధింత యజమానులపై చర్యలు తీసుకుంటామని డిప్యూటీ ఎంపీడీవో జె.ఆనందరావు అన్నారు. బుధవారం కొత్తపేటలో ఆయన పర్యటించారు. ప్రతి షాపు వద్దకు వెళ్లి యజమానులతో మాట్లాడారు. దుకాణాల వద్ద చెత్తబుట్టలను ఏర్పాటు చేసుకోవాలని, ప్రతిరోజు ఉదయాన్నే గ్రీన్ అంబాసిడర్లు వచ్చి ఆ చెత్తను కలెక్ట్ చేస్తారని వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల డిప్యూటేషన్ రద్దుచేయాలి

హరిపురం, ఆగస్టు20 (ఆంధ్రజ్యోతి): మందస మండలం పట్టులోగాం గిరిజన ఆశ్రమ పాఠశాల(ఐటీడీఏ) ఉపాధ్యాయుల డిప్యూటేషన్‌ను రద్దుచేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు లండ బాబూరావు డిమాండ్ చేశారు. హరిపురంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ఉపాధ్యాయుల మధ్య ఏర్పడిన వివాదం విద్యార్థుల, పాఠశాల భవిష్యత్తుపై ప్రభావం చూపిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. డిప్యూటేషన్ రద్దుచేసి పాత స్థానాల్లో వారిని నియమించాలని అన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు గున్న రమేష్, జగదీష్ బడిత్య, దాసరి ఈశ్వరరావు, బల్ల చిట్టిబాబు, వెంకటరమణ, కె.మాధవరావు, మధు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'డిపార్ట్‌మెంట్ ఉద్యోగులుగా గుర్తించాలి'

కాశీబుగ్గ, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): గ్రామీణ తపాలా ఉద్యోగులను డిపార్ట్‌మెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐజీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ఎన్.నందికేశ్వరరావు అన్నారు. బుధవారం కాశీబుగ్గ తపాలా కార్యాలయ ఆవరణలో తపాలా ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 8వ వేతన కమిటీ విధివిధానాలను వెంటనే అమలు చేయాలని, మినిమం పెన్షన్ రూ.10వేలు ఇవ్వాలని, అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. 8 గంటల పని భారం కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో తపాలా ఉద్యోగులు మోహన్‌రావు, వెంకటరమణ, ప్రకాష్‌రావు, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

జలుమూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని టెక్కలి డివిజన్ శక్తి టీం ఇన్‌చార్జి ఎం.గిరిధర్ అన్నారు. అచ్యుతాపురం ఉన్నతపాఠశాలలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. బాలికలు, మహిళల రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చట్టాలు రూపొందించాయన్నారు. వాటిని సద్వినియోగ పరచుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ రాజశేఖర్, శక్తి టీం సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డాక్టర్ కిరణ్‌కుమార్‌కు రాష్ట్రస్థాయి అవార్డు

కోటబొమ్మాళి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పశుసంవర్థక శాఖలో ఉత్తరాంధ్ర జోన్‌కు సంబంధించి శస్త్రచికిత్స విభాగంలో విశిష్ట సేవలు అందించిన డాక్టర్ లఖినేని కిరణ్‌కుమార్ రాష్ట్ర స్థాయి మెరిటోరియస్ అవార్డు అందుకున్నారు. విజయవాడలోని ఆ శాఖ కార్యాలయంలో బుధవారం రాష్ట్ర పశుసంవర్థకశాఖ డైరెక్టర్ డాక్టర్ టి.దామోదరనాయుడు నుంచి కిరణ్‌కుమార్ ఈ అవార్డు పొందారు. కార్యక్రమంలో ఏపీ పశుసంవర్థకశాఖ అదనపు డైరెక్టర్ వై.సింహాచలం, కోటబొమ్మాళి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు లఖినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


అవార్డు అందుకుంటున్న కిరణ్‌కుమార్

రేపు ఆరోగ్య సలహా సంఘ సమావేశం

పోలాకి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పోలాకి ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో శుక్రవారం ఆరోగ్య సలహా కమిటీ సమావేశం నిర్వహించనున్నట్టు విస్తరణాధికారి నల్లి రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి హాజరవుతారని చెప్పారు. కమిటీ సభ్యులు విధిగా హాజరుకావాలని అన్నారు.

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పలాస, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ జె.వెంకటలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ(హిస్టరీ), బీఎస్సీ(మ్యాథమెటిక్స్), బీఎస్సీ(జువాలజి), బీకాం(కంప్యూటర్ అప్లికేషన్) కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు కళాశాల పనివేళల్లో ఫోన్ నెంబరు 08945-293642కు సంప్రదించాలన్నారు.

ఓపెన్ ఇంటర్ ప్రవేశాలకు..

టెక్కలి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో 2025-26విద్యా సంవత్సరానికి గాను ఓపెన్ ఇంటర్మీడియట్ ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.తిరుపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, ఎంబైపీసీ, ఎంఈసీ, హెచ్ఈసీ, సీఈసీ వంటి కోర్సులు ఉన్నాయని అన్నారు. చదువు మధ్యలో ఆగిపోయిన వారు, వివిధ కారణాలతో చదువు కొనసాగించలేని వారు సెప్టెంబరు 15లోగా రూ.200 అపరాధ రుసుం చెల్లించి ప్రవేశాలు పొందాలని కోరారు.

కోర్టుల్లో ఉద్యోగాలకు పరీక్షలు ప్రారంభం

నరసన్నపేట, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు ఆధ్వర్యంలో స్టెనోగ్రాఫర్, గ్రేడ్-3, జూనియర్ అసిస్టెంట్, టైపిస్టు, ఎగ్జామినర్, ఫీల్డ్ అసిస్టెంట్, కాపియిస్టు, ప్రొసెస్ సర్వర్, డ్రైవర్, రికార్డు అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్ పోస్టుల భర్తీకి బుధవారం నుంచి స్థానిక కోర్ టెక్నాలజీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈనెల 24 వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. బుధవారం 320 మంది అభ్యర్థులు హాజరయ్యారు.

పింగలి వెంకయ్యకు నివాళి

టెక్కలి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జాతీయ జెండా రూపకర్త పింగలి వెంకయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ, అధ్యాపకులు నివాళులర్పించారు. క్విజ్ పోటీ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు

విద్యార్థులు మొక్కలు నాటాలి

కాశీబుగ్గ, ఆగస్టు 20 (ఆంధ్ర జ్యోతి): ఆక్సిజన్‌ను మార్కెట్లో కొనుక్కోకుండా ఉండాలంటే విద్యార్థులు మొక్కలు నాటాలని గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బి.గోపాల్ అన్నారు. బుధవారం కాశీబుగ్గ తాళభద్ర ప్రభుత్వ పాఠశాలకు సీలింగ్ ఫ్యాన్లు, మొక్కలు ఆయన అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గోపికృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బొడ్డపాడులో 'అన్నదాత సుఖీభవ' గ్రీవెన్స్

పలాసరూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): బొడ్డపాడు గ్రామంలో బుధవారం అన్నదాత సుఖీభవ గ్రీవెన్స్‌ను సచివాలయ అధికారులు నిర్వహించారు. అన్నదాత సుఖీభవ నగదు జమకాని రైతుల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో బొడ్డపాడు తెలుగు యువత అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు, సచివాలయ ఇన్‌చార్జి హార్టీకల్చర్ అసిస్టెంట్ యూన్సీ, రైతులు పాల్గొన్నారు.